క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి పూజలు



బల్లిగిరి వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఆషాఢ శుద్ధ ఏకాదశి, తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించనున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు.

సత్యనారాయణ స్వామి ఆలయ ఈవోగా రాజగోపాల్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజగోపాలరెడ్డి

డాబాగార్డెన్స్: ఇసుక కొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈవోగా టి.రాజగోపాల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయ ఈవోగా పని చేస్తున్న ఆయనకు శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మినగేష్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నగేష్‌కు భీమవరంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆయన మంగళవారం రిలీవయ్యారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్సులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, 'నాడు – నేడు' పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయ కుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సుశీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మళ్లీ అవే తిప్పలా బాబూ..!

- స్పెషలిస్ట్ వైద్యుల సేవలు నిలిచిపోవటంతో ప్రజల గగ్గోలు
- వేలు ఖర్చు చేసి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేమంటూ పేద ప్రజల ఆక్రోశం

వైద్యం కోసం ఎక్కడికో పరుగులు తీయాల్సిన అవసరం లేదు. వేలకు వేలు డబ్బు ఖర్చు చేయాల్సిన అగత్యం అంతకన్నా లేదు. పేదల ముంగిటే కార్పొరేట్ వైద్యం అన్న ఆశయంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వార్డుల్లోనే యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. నిపుణులైన వైద్యులు, ఖరీదైన మందులతో వారికి వైద్య సేవలు అందించింది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూపీహెచ్‌సీల్లో వారమంతా సేవలందించే స్పెషలిస్ట్ వైద్యుల సేవలను నిలుపుదల చేసింది. దీంతో పేదలు సంపూర్ణ వైద్యసేవలకు దూరమయ్యారు. ఇప్పుడు పలు వార్డుల్లోని యూపీహెచ్‌సీలకు రోజువారీ వచ్చే ఓపీ సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

డాబాగార్డెన్స్/జగదాంబ: నాణ్యమైన వైద్యం పేదలకు దూరమైపోయిన నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సత్సంకల్పంతో గతంలో బడుగు బలహీనవర్గాల చెంతకే వైద్యం తీసుకెళ్లింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్ప దొరకని అద్భుత వైద్యాన్ని పేదలకు ఉచితంగా వారి చెంతనే అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం వైపు అడుగులు వేసింది. ప్రతి వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కోట్లాది రూపాయల ఖర్చుకు వెనుకాడకుండా ఏర్పాటు చేసింది. నిపుణులైన వైద్యులు, కోట్లాది రూపాయలు ఖరీదు చేసే మందులు, రోగులను పరీక్షించేందుకు అత్యాధునిక ల్యాబ్‌లు, వాటిలో మరింత ఆధునికమైన ఎక్విప్‌మెంట్ సమకూర్చింది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రోజుకొక స్పెషలిస్ట్ డాక్టర్ ఆరోగ్య కేంద్రానికి వచ్చి సేవలందించేలా వీక్లీ చార్ట్ సిద్ధం చేసింది. దీంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్ప కనిపించని స్పెషలిస్ట్ డాక్టర్లను పేదలు పీహెచ్‌సీల్లో నేరుగా కలుసుకుని వైద్య సేవలు పొందేవారు. అయితే అది గతం.. వర్తమానానికి వస్తే వార్డుల్లోని యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు నిలిచిపోయాయి. దీంతో హెల్త్ సెంటర్లకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నివాసాలకు దగ్గరగా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఏ చిన్న సమస్య వచ్చినా ప్రజలు అక్కడికి వైద్యం కోసం వెళ్లేవారు. అక్కడే దాదాపు 60కి పైగా పరీక్షలు.. వ్యాధుల నిర్ధారణ.. ఆయా వ్యాధులను బట్టి మందుల అందజేత వంటివి వరుస క్రమంలో జరిగేవి. ఇదంతా కార్పొరేట్ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించటం వల్ల రోగులకు వెంటనే సాంత్వన చిక్కేది. దాంతో ఈ సేవల పట్ల పేదలు పూర్తి సంతృప్తిగా ఉండేవారు.



అచ్చియ్యమ్మపేట పీహెచ్‌సీలో బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది



రూ.కోటి 16 లక్షలతో కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ

దక్షిణలో 3 యూపీహెచ్‌సీల నిర్మాణం..

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 3 యూపీహెచ్‌సీలున్నాయి. దొండపర్తిలో రూ.98 లక్షలతో ఒకటి, 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో రూ.కోటీ 4 లక్షలతో ఒకటి, 34వ వార్డు కొబ్బరితోటలో రూ.కోటీ 16 లక్షలతో పది పడకలతో ఒకటి ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ప్రజలు ఆరోగ్య సేవలు పొందుతున్నారు. అలాగే రూ.10 లక్షలతో చెంగల్రావుపేట, రూ.10 లక్షలతో వన్‌టౌన్, రూ.10 లక్షలతో ప్రసాద్‌గార్డెన్స్, రూ.10 లక్షలతో అల్లిపురం యూపీహెచ్‌సీలకు మరమ్మతులు చేశారు.



ప్రసాద్‌గార్డెన్స్‌లో ఉన్న ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం

స్పెషలిస్ట్ వైద్యులను తొలగించారు..

ప్రతి యూపీహెచ్‌సీలో ఒక హెల్త్ ఆఫీసర్, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది, ఒక సూపర్‌వైజర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక శానిటరీ వర్కర్‌ను గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. వారితో పాటు వారమంతా యూపీహెచ్‌సీలను సందర్శించి రోగులకు సేవలందించేందుకు 8 మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండేలా కాంట్రాక్ట్ విధానంలో చర్యలు తీసుకుంది. చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, గైనిక్, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, పీడియాట్రిక్స్, జీరియాట్రిక్స్ (వృద్ధుల కోసం), జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు వైద్యులు రోజులో ఇద్దరు చొప్పున అందుబాటులో ఉండేవారు. ఇటీవల వారి కాంట్రాక్ట్ పూర్తి కావడంతో ప్రస్తుత ప్రభుత్వం వారిని నిలిపేసింది. దీంతో వారి సేవలు పేదలకు అందకుండా పోయాయి. ప్రస్తుతం ఆస్పత్రి హెల్త్ ఆఫీసర్లే అన్నింటికీ తామే అన్నట్లు రోగులకు సేవలందిస్తున్నారు. దీంతో రోగులకు నిరీక్షణ తప్పటంలేదు.

అన్నింటికీ ఒకే డాక్టర్..



జగన్‌బాబు ప్రభుత్వంలో ఇంటి వద్దే వైద్యం పొందేవాళ్లం. ఆస్పత్రికి వెళ్తే పెద్ద డాక్టర్లు చక్కగా పరీక్షలు చేసేవారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చేవారు. ఏ రోగం వచ్చినా అక్కడికి వెళ్లి చూపించుకుని మందులు వాడితే ఇట్టే తగ్గేది. వ్యాధులకు తగ్గట్లు అప్పట్లో వచ్చినట్లు ఇప్పుడు డాక్టర్లు రావటంలేదు. అన్నింటికీ ఒకే డాక్టర్ చూస్తున్నారు. మాకు మళ్లీ అవే బాధలు వచ్చాయి. మాలాంటి వృద్ధులకు అప్పటి మాదిరి సేవలే అందిస్తే బాగుంటుంది.

–నీలాపు రాజులమ్మ, ప్రసాద్ గార్డెన్స్, 35వ వార్డు

నిపుణుల సేవలు పునరుద్ధరించాలి..



చంద్రబాబు ప్రభుత్వం నిజంగా పేదల కోసం ఆలోచిస్తే మళ్లీ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య నిపుణుల సేవలు ప్రారంభించాలి. అప్పుడే మేమంతా ఆయన ప్రభుత్వాన్ని నమ్ముతాం. జగన్‌బాబు ఉన్నప్పుడే బాగుండేది. రోగానికి తగ్గ వైద్యుడు అందుబాటులో ఉండేవాడు. చక్కగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మా ఇళ్ల దగ్గరున్న ఆస్పత్రులకు వెళ్తే మునుపటి సేవలు చేసే డాక్టర్లెవరూ రావటంలేదని తెలిసింది. మాకు మళ్లీ అటువంటి సేవలే అందించాలని కోరుతున్నాం.

–అలవన దేముడు, పండా వీధి, 35వ వార్డు

డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు..



ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. గతంలో స్పెషలిస్టు డాక్టర్లు ఉండే వారు. రోజుకి ఒక స్పెషలిస్టు డాక్టర్ వచ్చి సేవలందించేవారు. ఇప్పుడు ఉదయం పూట కూడా డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. పీహెచ్‌సీకి వెళ్లినా తిరిగి రావాల్సి వస్తుంది. నర్సులు మాత్రమే ఉంటున్నారు.

–చినిపిల్లి యల్లయమ్మ, ఫిష్‌మార్కెట్ వ్యాపారి

ఊహకి అందని విధంగా..



దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య సేవలు అందించింది. సచివాలయ సిబ్బందితో పాటు ఏఎన్ఎం, ఆశ వర్కర్, వైద్య సిబ్బంది, జీవీఎంసీ, కలెక్టరేట్ సిబ్బంది ప్రతి గడపకు వెళ్లి వైద్యం కోసం ఆరా తీసేవారు. ఆరోగ్య కేంద్రాల్లో వారమంతా స్పెషలిస్ట్ వైద్యులు తని ఖీలు చేసి వైద్యం చేసేవారు. ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు.

–వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

వేతన ఒప్పందం అమలుకు త్వరలో దీక్షలు



దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని, పోర్టులో ప్రైవేటీకరణ ఆపాలని ఈ నెల 25, 26 తేదీల్లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జె. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం సిటు కార్యాలయంలో పెండింగ్ సమస్యలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి అమలు చేయాల్సిన వేతన పెంపుదలకు సంబంధించి చర్చలకు పిలవలేదన్నారు. వేతన ఒప్పంద కాలం ముగిసి ఇప్పటికి 30 నెలలు పూర్తయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపీఏ దుర్మార్గమైన షరతులు విధించి కాలయాపన చేస్తుందన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ఎస్ఐ సతీష్, ఉపాధ్యాయులు

అల్లిపురం: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని టూటౌన్ ఎస్ఐ కె.సతీష్ అన్నారు. డాబాగార్డెన్స్, రవీంద్ర భారతి స్కూల్లో మంగళవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందించారు. రవీంద్ర భారతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.ఎస్.మణి విద్యార్థి నాయకులు చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ప్రిన్సిపాల్ పి.శారదారెడ్డి, డీన్ సుధాలత, సీజీఎం వసంత పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తెలకుల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పెబ్బిలి రవికుమార్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా గాండ్ల తెలకుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు విశాఖ జిల్లా గాండ్ల తెలకుల కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ పెబ్బిలి రవికుమార్ తెలిపారు. దండుబజార్ సమీపంలో గల సంఘ కార్యాలయంలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అధ్యక్షతన కమిటీ సమావేశమైంది. జిల్లాలో నిర్మించనున్న సంఘ కల్యాణ మండపానికి ప్రభుత్వం తరపున 2000 గజాల స్థలం, రూ.కోటి ఆర్థిక సాయం, గాండ్ల తెలకుల దేవ తెలుకుల కార్పొరేషన్ నిధుల నుంచి వెనుకబడిన కుల బంధువులకు ఆర్థిక సాయం అందించేందుకు, అర్హులైన కుల బంధువుల విద్యార్థులకు విదేశీ విద్యకు అవసరమైన ఆర్థిక సాయం అందివ్వడం, బీసీ సాధికారతలో భాగంగా సంఘానికి బీసీ డిక్లరేషన్ చేయమని, నూతన గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేసిన సంఘ సీనియర్ సభ్యులను గుర్తించి కార్పొరేషన్ పదవులు, నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎన్నేటి తాతారావు, చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్, ఎన్నేటి సన్యాసిరావు, దాడి లక్ష్మణ్‌కుమార్, గందేపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



వన్‌టౌన్ వద్ద సిల్ట్ చాంబర్‌ను శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్



రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను యార్డుకు తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

జగదాంబ: వర్షాల నేపథ్యంలో డ్రెయిన్లు బ్లాక్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న భారీ సిల్ట్ చాంబర్‌ను పరిశీలించి శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో సిల్ట్ చాంబర్లను శుభ్రపరచాలన్నారు. అదే విధంగా రామకృష్ణా జంక్షన్, రామకృష్ణా రైతు బజార్, పోర్టు వద్ద ఉన్న కెనాల్‌లో కూడా సిల్ట్ తీయాలన్నారు. ఇందుకు అవసరం అయితే జేసీబీలను ఉపయోగించాలన్నారు. అదే విధంగా వన్‌టౌన్ విస్తరణలో భాగంగా జరుగుతున్న పనులకు సంబంధించి చెత్త, మట్టి, సిమ్మెంట్ రద్దును కాంట్రాక్టర్లచే ఎప్పటికప్పుడు ఎత్తించాలన్నారు. మురుగు నీటి ప్రవాహం రహదారులపై పారకుండా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: విశాఖ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 24 కిలోల గంజాయిని తమిళనాడుకు చెందిన ప్రేమనిసార్, శిశురాజులు కొనుగోలు చేసి సోమవారం రాత్రి రెండు బ్యాగులతో విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు వారిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి తేస్తే నగదు ఇస్తానని తమిళనాడుకు చెందిన రియాజ్ అనడంతో అరకు వచ్చి గొనుగోలు చేశామని నిందితులు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ సీతమ్మధార టీపీటీ కాలనీలో 400 ఎంఎం వ్యాసం గల పంపింగ్ మెయిన్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఈ నెల 18న జోన్–3 పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–3 పరిధి టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, చైతన్య నగర్, క్రాంతినగర్, శారదా స్కూల్ ఏరియా, రామకృష్ణా నగర్, లలితానగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చిన్నూరు, మంగలి వీధి ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడతుందని తెలిపారు. అత్యవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు.

రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల పక్కనే కుక్కలు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద తీవ్రంగా వుంది. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన ఈ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఇక్కడకు వచ్చిన పర్యాటకులను పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు ఇక్కడి కుక్కలను పట్టుకున్నారు. అయితే వాటిని బీచ్‌కు కాస్త దూరంలో విడిచిపెట్టిమమ అనిపించారు. దీంతో అవి మరలా తీరానికి చేరుకున్నాయి. ప్రస్తుతం పర్యాటకులు ఇక్కడి బీచ్‌కు రావాలంటే ఆందోళన చెందుతున్నారు. బీచ్‌లో కుక్కలను కట్టడి చేయాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

రహదారి పనుల పరిశీలన



రైల్వే న్యూకాలనీలో రహదారి పనులు చేస్తున్న కార్మికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పరిశీలించారు. రైల్వే న్యూకాలనీ, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ వీధిలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నారు. రూ.20లక్షల నిధులతో చేపట్టిన ఈ పనులను ఆళ్ల శ్రీనివాస్ పరిశీలించారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- తుప్పు పట్టిన వాహనాలను తరలించాలి
- చీకటి పడితే మరింత ఇబ్బందులు
- ట్రాఫిక్ పోలీసుల స్పందన కరవు



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రహదారిలో వాహనాల అక్రమ పార్కింగ్



జ్ఞానాపురానికి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు

కంచరపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌తో వాహన చోదకులు, స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు నరక యాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెంకు, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతుండడంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై వాహనాలు నిలపడంతో చెత్తచెదారాలు, మట్టి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో శానిటరీ సిబ్బంది వాటిని ఊడ్చే పనులు వదులుకున్నారు. ఇరుకురోడ్లపై వాహనాలు నిలిపే కారణంగా కొన్నిసార్లు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ లేకుండా పోతోంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వాహనాలు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.



కంచరపాలేనికి వెళ్లే రహదారికి ఇరువైపులా వాహనాల మరమ్మతులు